E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 30-04-2025 (వారం) బుధవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




భానుడి భగభగ.. జగిత్యాలలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు » 3లో

తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్.. కార్మికుల కీలక డిమాండ్లు ఇవే! » 3లో



ఆటో పరిశ్రమపై ట్రంప్ పట్టు విడుపు..? » 3లో



దేశ వ్యతిరేకులపై స్పైవేర్ ఉపయోగిస్తే తప్పేంటి? 'పెగాసస్'పై సుప్రీం కీలక వ్యాఖ్యలు



» 3లో

## మిస్ వరల్డ్ పోటీలకు కట్టుదిట్టంగా భద్రత ఏర్పాటు చేయండి

- హైదరాబాద్‌కి మిస్ వరల్డ్ ఘనత
- సీఎం రేవంత్ భద్రత ఆదేశాలు
- అతిథులకు ప్రత్యేక ఏర్పాట్లు
- పర్యాటక ప్రోత్సాహానికి అవకాశం
- నగర సుందరీకరణకు వేగం



**మిస్ వరల్డ్ పోటీలకు కట్టుదిట్టంగా భద్రత ఏర్పాటు చేయండి: సీఎం రేవంత్ ఆదేశం**

ఈ కబురు,హైదరాబాద్: తెలంగాణ రాజధాని హైదరాబాద్ వేదికగా జరగనున్న మిస్ వరల్డ్ 2025 పోటీలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 2025, మే 10 నుంచి ప్రారంభం కానున్న మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం (ఏప్రిల్ 29) సీఎం రేవంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో 72వ మిస్ వరల్డ్ నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను సమావేశంలో అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు ఆదేశాలు జారీ చేశారు.

తరువాయి 2లో




## మిస్ వరల్డ్ పోటీలకు ముమ్మర ఏర్పాట్లు

- 31వ తేదీన హైటెక్స్ లో 'గ్రాండ్ ఫినాలే'
- మే 6వ తేదీ నుంచి నగరానికి రానున్న పోటీదారులు
- 10వ తేదీన గచ్చిబౌలి స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభం

ఈ-కబురు, శేరిలింగంపల్లి : హైదరాబాద్ నగరం మరో ప్రపంచ స్థాయి వేడుకకు సిద్ధమైంది. ప్రపంచ వ్యాప్తంగా 120 దేశాల నుంచి విచ్చేస్తున్న అతివలతో మిస్ వరల్డ్-2025 నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ఏర్పాట్లు చేపడుతుంది. ఈమేరకు ఎయిర్ పోర్టు నుంచి హోటళ్లు, పర్యాటక ప్రదేశాలు, ఈవెంట్లు జరిగే వేదికలు, పోటీదారులు విడిది చేసే ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొనే పోటీదారులతో పాటు ఈ పోటీల కోసం నగరానికి వస్తున్న అతిథులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం పలువురు మంత్రులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

తరువాయి 2లో

## నేడు టెన్త్ ఫలితాలు




**తెలంగాణలో లక్షలాది మంది విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న పదో తరగతి పరీక్షల ఫలితాలవిడుదలకు ముహూర్తం ఖరారైంది.**

ఈ కబురు: తెలంగాణలో లక్షలాది మంది విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న పదో తరగతి పరీక్షల ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి బుధవారం (ఏప్రిల్ 30) మధ్యాహ్నం ఒంటి గంటకు రవీంద్ర భారతిలో విడుదల చేయనున్నారు

» 2లో

## ఎప్ సెట్ మొదటిరోజు పరీక్షలు ప్రశాంతం



**ఈ కబురు,హైదరాబాద్:**
రాష్ట్రంలో ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ ఎప్ సెట్ పరీక్షలు మంగళవారం పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎప్ సెట్ కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు

»2లో




## భారాస నేతల నిర్లక్ష్యమే 'కాళేశ్వరం'ని దెబ్బతీసింది: ఉత్తమ్

**కాళేశ్వరం ప్రాజెక్టులో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఎన్‌డీఎస్ఏ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా భారాస నేతలు సిగ్గుపడటం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు.**

ఈ కబురు,హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఎన్‌డీఎస్ఏ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా భారాస నేతలు సిగ్గుపడటం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. 'ఎన్‌డీఎస్ఏ ఎవరు..? వాళ్లెవరు నివేదిక ఇవ్వడానికి' అని కించపరిచేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎక్కువ కమీషన్లు వస్తాయని గత ప్రభుత్వ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన నివేదికపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కమీషన్ల కోసం ప్రాజెక్టు అంచనాను భారీగా పెంచుకుంటూ పోయారని మండిపడ్డారు. రూ.80వేల కోట్లకు అనుమతులు తీసుకుంటే.. ఇప్పటికే రూ.లక్ష కోట్లు దాటిపోయిందన్నారు.

తరువాయి 2లో

## సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం: ప్రధాని నరేంద్రమోదీ



**పహల్గాం దాడి అనంతరం నెలకొన్న పరిస్థితులపై సీడీఎస్, రక్షణమంత్రి, ఎన్ఎస్ఏలతో ప్రధాని మోదీ కీలక సమావేశం నిర్వహించారు.**

ఈ కబురు; ఉగ్రవాదాన్ని అణచివేయాలనేదే దేశ సంకల్పమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. భారత సాయుధ దళాల సామర్థ్యాలపై తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఇటీవల ఉగ్రదాడిపై ప్రతిస్పందించే విషయంలో.. అనుసరించాల్సిన పద్ధతులు, లక్ష్యాలు, సమయాన్ని నిర్ణయించే విషయంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ సహా త్రివిధ దళాల అధిపతులతో ఉన్నత స్థాయి సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

తరువాయి 2లో

## మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ నివేదికలో ఎక్కడా లేదు: హరీశ్‌రావు



కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక మీద నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ మాట్లాడినవన్నీ అబద్ధాలేనని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు.

ఈ కబురు,హైదరాబాద్: కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక మీద నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ మాట్లాడినవన్నీ అబద్ధాలేనని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదన్నారు. రాష్ట్రమంతటా బీఆర్ఎస్ రజతోత్సవ సభ, కేసీఆర్ ప్రసంగంపై చర్చ జరుగుతోందనే అక్కసుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్డీఎస్ఏ ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగామారిందని హరీశ్‌రావు ఆక్షేపించారు.

తరువాయి 2లో

## కేకేఆర్ ఈజ్ బ్యాక్.. ఢిల్లీపై గ్రాండ్ విక్టరీ

» 6లో



## మనం ఐక్యంగా ఉండాలి.. ట్రంప్‌నకు అవకాశం ఇవ్వొద్దు కెనడా ప్రధాని

» 2లో



## ఉత్కంఠపోరు.. దక్షిణాఫ్రికా పై భారత్ విజయం



» 6లో

## దాయాదికి మరో షాక్.. పాక్ ఎయిర్‌లైన్లకు భారత గగనతలం మూసివేత..?

» 3లో





చట్టం పేద ప్రజలకు చుట్టంలా ఉండాలనే భూభారతి చట్టం రూపొందించామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

» 2లో

## భూభారతి చట్టం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుంది మంత్రి పొంగులేటి

మొదటి పేజీ తరువాయి

# సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం: ప్రధాని నరేంద్రమోదీ



పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశంలో అంతర్గత భద్రత, సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని మోదీ తన నివాసంలో కీలక సమావేశం ఏర్పాటు చేశారు. దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ భేటీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దొభాల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠీ, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్‌లు పాల్గొన్నారు.

**ఊహకందని రీతిలో..**

ఈ సందర్భంగా పాకిస్థాన్‌ను ప్రస్తావించిన ప్రధాని మోదీ.. ఉగ్రవాదులు, వారిని పెంచి పోషిస్తున్న వారిని పాతాళంలో తొక్కేస్తామని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అంతేకాదు, వారి ఊహకందని రీతిలో చర్యలు ఉంటాయని చెప్పినట్లు సమాచారం. పహల్గాం ఉగ్ర ఘటనకు ప్రతీకార దాడులు తప్పవని ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ ప్రధాని మోదీ మాటలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.

**వరుస భేటీలు..**

మరోవైపు భద్రతారంగ కేబినెట్ కమిటీ బుధవారం సమావేశం కానుంది. వారం రోజుల వ్యవధిలో భేటీ కానుండటం రెండోసారి. అనంతరం మోదీ నేతృత్వంలో రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం కానుందని సమాచారం. ఇందులో సీసీఎస్‌లోని ఐదుగురు సభ్యులతో పాటు రవాణా, ఆరోగ్య, వ్యవసాయ, రైల్వే మంత్రులు ఉన్నారు. ఇలా కీలక భేటీలు జరిగే ఒకరోజు ముందే త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని మోదీ సమావేశం ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇదిలా ఉంటే, 2016లో ఉరిలో ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వెంబడి భారత సైన్యం మెరుపుదాడులు చేసింది. అనంతరం 2019లో సీఆర్పీఎఫ్ బలగాలే లక్ష్యంగా పుల్వామాలో జరిగిన దాడి అనంతరం భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్స్ చేపట్టిన సంగతి తెలిసిందే.

# మిస్ వరల్డ్ పోటీలకు కట్టుదిట్టంగా భద్రత ఏర్పాటు చేయండి: సీఎం రేవంత్ ఆదేశం


మొదటి పేజీ తరువాయి



ఈ కార్యక్రమంలో పాల్గొనే అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనడానికి విచ్చేసే అతిథుల కోసం ఎయిర్ పోర్టు, వారు బస చేసే హోటళ్లు, కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు అతిథుల ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కార్యక్రమాలకు సంబంధించి విభాగాల వారిగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. నగరంలో పెండింగ్‌లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని, మిస్ వరల్డ్ 2025 ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, పూర్తి చేయాల్సిన పనులు, ఏర్పాట్లకు సంబంధించి పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు.

# మిస్ వరల్డ్ పోటీలకు ముమ్మర ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి




**6వ తేదీ నుంచి నగరానికి రాక...**

మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ పోటీలకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 120 దేశాల నుంచి సుందరీమణులు హాజరవుతున్నారు. వీరితో పాటు పోటీల కోసం దేశ, విదేశాలకు చెందిన అతిథులు సైతం నగరానికి క్యూ కట్టనున్నారు. ఈమేరకు పోటీదారులకు నగరంలోని పలు హోటళ్లలో విడిది ఏర్పాట్లు చేపడుతున్నారు. పోటీలలో పాల్గొంటున్న సుందరీమణులు మే 6,7,8 తేదీలలో నగరానికి రానున్నారు. మిస్ వరల్డ్ పోటీదారులు ప్రయాణించే శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి నగరంలోని వివిధ హోటళ్ల వరకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**10వ తేదీన గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభం...**

మిస్ వరల్డ్ పోటీలు మే 10వ తేదీన గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 6.30 గంటలకు ప్రారంభం కానున్నాయి. ప్రారంభోత్సవం సందర్భంగా తెలంగాణ ట్రెడిషనల్ ఫోక్ సాంగ్స్, ట్రైబల్ డ్యాన్సులతో పోటీదారులను ఆహ్వానించనున్నారు. మే 12వ తేదీన ఆధ్యాత్మిక టూర్ లో భాగంగా నాగార్జున సాగర్ సందర్శన, మే 13వ తేదీన హెరిటేజ్ వాక్ లో భాగంగా నగరంలోని చార్మినార్, లాడ్ బజార్ లలో పర్యటిస్తారు. అదేరోజు సాయంత్రం పోటీదారులకు ప్రఖ్యాత చౌమొహల్లా ప్యాలెస్ లో వెల్కం డిన్నర్ ఏర్పాటు చేశారు. 14వ తేదీన గ్రూప్1 పోటీదారులు వరంగల్ పర్యటన, గ్రూప్2 పో'టీదారులు రామప్పదేవాలయాన్ని సందర్శిస్తారు. మే 15వ తేదీన గ్రూప్1 పోటీదారులు యాదగిరిగుట్ట దేవస్థానం, గ్రూప్2 పోటీదారులు పోచంపల్లిలో పర్యటిస్తారు. 16వ తేదీన గ్రూప్1 పోటీదారులు మెడికల్ టూరిజం ఈవెంట్లో, గ్రూప్2 పోటీదారులు ఎకో టూరిజం ఈవెంట్లో పాల్గొంటారు. 17వ తేదీన గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించే స్పోర్ట్స్ ఫైనల్స్ లో, రామోజీ ఫిలింసిటీ టూర్ లో పోటీదారులు పాల్గొంటారు. 18వ తేదీన పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, ట్యాంక్ బండ్ సందర్శన ఉంటుంది. మే 20,21వ తేదీల్లో టిహబ్, శిల్పారామంలో పలు పోటీలు కొనసాగనున్నాయి. మే 22వ తేదీన శిల్పకళావేదికలో మిస్ వరల్డ్ టాలెంట్ ఫైనల్, 23వ తేదీన ట్రైడెంట్ హోటల్లో హెడ్ టు హెడ్ ఛాలెంజ్ ఫైనల్, 24వ తేదీన ఫ్యాషన్ ఫైనల్ పోటీలు కొనసాగనున్నాయి. 26వ తేదీన హైటెక్స్ లో డ్యాన్స్ అండ్ కల్చరల్ ప్రదర్శనల్లో పాల్గొంటారు. 31వ తేదీన హైటెక్స్ లో ప్రతిష్టాత్మకంగా రెడ్ కార్పెట్ గ్రాండ్ ఫినాలే పోటీలు కొనసాగనున్నాయి. జూన్ 2వ తేదీన మిస్ వరల్డ్ విజేతలు తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రిలను కలవనున్నారు.

మొదటి పేజీ తరువాయి

# భారాస నేతల నిర్లక్ష్యమే 'కాళేశ్వరం'ని దెబ్బతీసింది: ఉత్తమ్




"వివిధ పేర్లతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తీసుకున్నారు. అధికశాతం వడ్డీకి స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారు. భారాస హయాంలోనే ప్రాజెక్టు నిర్మించారు. వాళ్ల హయాంలోనే కూలిపోయింది. ఎన్డీఎస్ఏ అనేది పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడింది. చట్టం చేసినప్పుడు భారాస ఎంపీలు మద్దతిచ్చారు. బ్యారేజీల భద్రతపై ఎన్డీఎస్ఏ అత్యున్నత బోర్డు. దేశంలోని 700 బ్యారేజీల భద్రతను పరిశీలిస్తోంది. వివిధ అంశాల్లో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో ఈ బోర్డు ఏర్పాటైంది.

తుమ్మడిహట్టి కాదని మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించడమే ప్రధాన లోపమని ఎన్డీఎస్ఏ చెప్పింది. మేడిగడ్డ ప్రతిపాదనను సీడబ్ల్యూసీ ప్రారంభంలోనే తోసిపుచ్చింది. బ్యారేజీ పూర్తయిన తొలి ఏడాదిలోనే లోపాలు బయటపడ్డాయి. లోపాలు ఉన్నాయని ఇంజినీర్లు చెప్పినా సరే.. పట్టించుకోకపోవడంతో నష్ట తీవ్రత పెరిగింది. మేడిగడ్డ నిర్మాణంలో లోపాలపై భారాస ఉన్నప్పుడు కూడా ప్రాథమిక నివేదిక ఇచ్చారు. బ్యారేజీ లోపలి భాగంలో నీళ్లు భూమిలోకి పోయి బ్యారేజీ వెలుపలకు వస్తున్నాయి. బ్యారేజీ నిర్మాణానికి మట్టి పరీక్షలు, నాణ్యత పరీక్షలు చేయలేదు.

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ సీపేజీ ఉందని ఎన్డీఎస్ఏ నివేదిక చెబుతోంది. నిర్మాణం మొదలుపెట్టిన 6 నెలల తర్వాత సీడబ్ల్యూసీకి డీపీఆర్ పంపించారు. ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చవద్దని ఐదుగురు విశ్రాంత ఇంజినీర్లతో కేసీఆర్ ఏర్పాటు చేసిన నిపుణుల బృందమే చెప్పింది. సీడబ్ల్యూసీకి ఇచ్చిన డీపీఆర్‌లో కూడా తర్వాత ఇష్టారాజ్యంగా మార్పులు చేశారు. డీపీఆర్‌కు విరుద్ధంగా కేసీఆర్ ఎలా చెప్తే అలా నిర్మించేశారు. భారాస నేతల నిర్లక్ష్యం, కక్కుర్తి, అవినీతి వల్ల ప్రాజెక్టు పనికిరాకుండా పోయింది'' అని ఉత్తమ్ మండిపడ్డారు.

# మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ నివేదికలో ఎక్కడా లేదు: హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి



కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై హరీశ్‌రావు స్పందించారు. ఈ సందర్భంగా పలువురు నేతలతో కలిసి ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ''జాతీయ డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతలకు డీపీఆర్ ఉందా? డీపీఆర్ లేకుండానే కొడంగల్ ఎత్తిపోతల పనులు ప్రారంభించారు. పోలవరంలో డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోతే ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడలేదు? పోలవరానికి ఎందుకు పోలేదు? ఎందుకు నివేదిక ఇవ్వలేదు? ఎన్డీఎస్ఏ అనేది ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగా మారింది. కాంగ్రెస్, భాజపా కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయి'' అని విమర్శించారు.

మొదటి పేజీ తరువాయి

# నేడు టెన్త్ ఫలితాలు



. ఈ విషయాన్ని ప్రభుత్వ పరీక్షల విభాగం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వరకు రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు జరగ్గా.. దాదాపు 5లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి కావడం, మార్కుల మెమోలను ఎలా ఇవ్వాలన్న అంశంపై పూర్తిస్థాయిలో క్లారిటీ రావడంతో అధికారులు ఫలితాల విడుదలకు రంగం సిద్ధం చేశారు. విద్యార్థులు తమ ఫలితాలను results.eenadu.netలో ఒక్క క్లిక్‌తోనే పొందొచ్చు.

**ఇకపై మార్కుల మెమోలు ఇలా..**

ఇంత వరకు పదో తరగతిలో సబ్జెక్టుల వారీగా గ్రేడ్లతో పాటు సీజీపీఏఇచ్చేవారు. కానీ, ఇక నుంచి సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్‌లు ఇవ్వనున్నారు. మార్కుల మెమోలపైనా సబ్జెక్టుల వారీగా రాత పరీక్షలు, అంతర్గత పరీక్షల మార్కులు, మొత్తం మార్కులు, గ్రేడ్ పొందుపరుస్తారు. చివరకు విద్యార్థి పాసయ్యారా? ఫెయిల్ అయ్యారా అనే వివరాలను పేర్కొంటారు. ఇంకా బోధనేతర కార్యక్రమాల(కో కరిక్యులర్ యాక్టివిటీస్)లో విద్యార్థులకు గ్రేడ్లు ఇస్తారు. వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ ఎడ్యుకేషన్, ఆర్ట్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్, వర్క్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ అనే నాలుగు కో కరిక్యులర్ యాక్టివిటీస్‌కు సంబంధించి గ్రేడ్లు కూడా ముద్రిస్తారు.

మొదటి పేజీ తరువాయి

# మనం ఐక్యంగా ఉండాలి.. ట్రంప్‌నకు అవకాశం ఇవ్వొద్దు కెనడా ప్రధాని

**ప్రజలను విడగొట్టి.. కెనడాను సొంతం చేసుకోవడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారని కెనడా ప్రధాని మార్క్ కార్నీ మండిపడ్డారు.**

ఈ కబురు: కెనడాలో అధికార లిబరల్ పార్టీ మరోసారి అధికారం చేపట్టడం దాదాపు ఖాయమైంది. దీంతో విజయం దిశగా దూసుకెళ్తోంది. నూతన ప్రధానిగా మార్క్ కార్నీ మరోసారి బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈనేపథ్యంలో ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజల్లో విభేదాలు సృష్టించి, విచ్ఛిన్నం చేసి కెనడాను సొంతం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో అమెరికా సుంకాలు, విలీనానికి సంబంధించిన బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. కాబట్టి ఎలాంటి పరిస్థితులు ఎదురైనా కెనడియన్లు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్యయుద్ధంలో అగ్రదేశంపై తాము గెలుస్తామని కార్నీ ప్రజలకు హామీ ఇచ్చారు. అమెరికా తమకు చేస్తున్న ద్రోహాన్ని ఎన్నటికీ మరిచిపోవ్వని.. దీని నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. ఎన్నో ఏళ్లుగా కెనడా అనుసరిస్తున్న ఐక్యత, అభివృద్ధి, స్థితిస్థాపకత వంటి విలువలను తాను ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన మొదటి కొన్ని నెలలు సవాలుగా ఉండొచ్చని.. అయినప్పటికీ దేశాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కెనడా గతంలో కంటే బలంగా పుంజుకుంటుందని అన్నారు. ఎన్నికల్లో తమకు గట్టి పోటీ ఇచ్చినందుకు ప్రతిపక్ష నాయకుడు పోయిలివ్రేను కార్నీ అభినందించారు. దేశ అభివృద్ధి విషయంలో తామందరం ఒకేలా ఆలోచిస్తామని తెలిపారు. కెనడా తమలో విలీనం కావాలని ఇప్పటికే పలుమార్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులకు పాల్పడిన విషయం తెలిసిందే. నేడు ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో ఆయన మరోసారి టారిఫ్‌ల ప్రస్తావన తీసుకువచ్చారు. కెనడా అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరితే.. ఇప్పటివరకు విధించిన సుంకాలను పూర్తిగా తొలగిస్తానన్నారు. యూఎస్‌తో ఎలాంటి సరిహద్దులు లేకుండా ప్రజలందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తామని.. వాణిజ్యం, వ్యాపారాల్లో ప్రతికూలతలు లేకుండా అన్నిరకాల సానుకూల చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తమ ప్రతిపాదనకు ఒప్పుకుంటే ఇలాంటి ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని.. లేదంటే ప్రతియేటా ఆ దేశానికి ఇస్తున్న వందల బిలియన్ డాలర్ల సబ్సిడీని ఆపేస్తామని హెచ్చరించారు.


# భూభారతి చట్టం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుంది మంత్రి పొంగులేటి

మొదటి పేజీ తరువాయి

ఈ కబురు,షట్‌పల్లి: చట్టం పేద ప్రజలకు చుట్టంలా ఉండాలనే భూభారతి చట్టం రూపొందించామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా షట్‌పల్లిలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోన్న మంచి పనులు చూడలేక మాజీ సీఎం కేసీఆర్‌కు దుఃఖం వస్తోందన్నారు. ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూన్ 2 వరకు పైలట్ ప్రాజెక్టు మండలాల్లోని భూసమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అధికారులు మాట వినలేదని కేసీఆర్ రెవెన్యూ వ్యవస్థను రద్దు చేశారని విమర్శించారు. పది రోజుల్లోనే గ్రామాల్లో రెవెన్యూ అధికారులను నియమిస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

మొదటి పేజీ తరువాయి

# ఎప్ సెట్ మొదటిరోజు పరీక్షలు ప్రశాంతం



అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు మొదటి సెషన్ ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు జరిగాయని అధికారులు తెలిపారు. మొత్తం హాజరు శాతం ఉదయం సెషన్ కు 92.74 శాతం, మధ్యాహ్నం సెషన్ కు 93.53 శాతంగా నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.

ఉదయం సెషన్ కు 28834 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 26741 మంది హాజరు కాగా, 2093 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా, మధ్యాహ్నం సెషన్ కు 28830 మంది నమోదు చేసుకోగా, 26964 మంది హాజరు కాగా, 1866 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షల ప్రారంభ సమయంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి, జెఎన్‌టియుహెచ్ వైస్‌ఛాన్సలర్, టిజి ఇఎపిసెట్ ఛైర్మన్ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి లు పరిక్షల సరళిని పర్యవేక్షించారని పేర్కొన్నారు. ఈ నెల 29, 30 వ తేదీల్లో జరిగే అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షల కోసం 112 సెంటర్లు ఏర్పాటు చేశారు. మే 2 నుంచి 4 వరకు జరిగే ఇంజనీరింగ్ స్ట్రీమ్ కోసం 124 సెంటర్లు ఏర్పాటు చేశారు.

# భూ రికార్డులు సరిచేసి.. మాకు న్యాయం చేయండి


తహసీల్దార్‌తో సమావేశమైన వెలిమెల సర్వే నంబర్ 129 రైతులు


తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న రైతులు

## వెలిమెల సర్వే నంబర్ 129 రైతుల ఆవేధన

ఈకబురు, పఠాన్ చెరు : వంశపారంపర్యంగా వచ్చిన తమ భూముల రికార్డులు సరిచేసి అందరికీ సమాన హక్కులు కలిగేలా అధికారులు సహకరించాలని సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెల రైతులు కోరారు. సర్వే నంబర్ 129లో అందరికీ చెందాల్సిన భూమి ఒకే వ్యక్తి పేరుపై రికార్డు అయ్యిందని.. దీనిని సవరించాలని నెలల తరబడి తిరుగున్నా సమస్య పరిష్కారం కాలేదని వారు ఆవేధన వ్యక్తం చేశారు. ఈ విషయమై మంగళవారం రామచంద్రాపురం తహసీల్దార్ ముందు రైతులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు శ్రీను మాట్లాడుతూ సర్వే నంబర్ 129 లో తమ పూర్వీకుల నుండి దాదాపు 17 ఎకరాల భూమి వారసత్వంగా సంక్రమించిందని పేర్కొన్నారు. అందులో దాదాపు 9 ఎకరాలు ఔటర్ రింగ్ రోడ్డులో పోగా, మిగిలిన భూమిని హక్కుదారులైన తమ సోదరులందరికీ సమానంగా పంచాల్సి ఉందన్నారు. ఈ విషయంలో గత కొన్నేళ్లుగా కోర్టులో వాదనలు జరిగాయని, గత ఏడాది తీర్పు కూడా వచ్చిందన్నారు. కోర్టు పరిధిలో ఉండగానే అక్రమ పద్ధతిలో మాకు దక్కాల్సిన భూమిని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేశారని ఆరోపించారు. మండల అధికారుల నిర్లక్ష్యంతోనే తమ భూములు వేరే వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయని, సదరు రికార్డులు సవరించాలని 8 నెలలుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. కోట్ల విలువైన తమ భూములపై ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, రికార్డులు సవరించి అందరికీ సమాన హక్కులు కలిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### భూ బదలాయింపులో అధికారుల ప్రమేయం లేదు: రామచంద్రాపురం తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి

వెలిమెల సర్వే నంబర్ 129 భూ బదలాయింపులో రెవెన్యూ అధికారుల ప్రమేయం లేదు. మున్నూరు కుటుంబ సభ్యులలో ఒకరి పేరుపై ఉన్న భూమిని, అది కూడా దరణి నిబంధనలకు అనుగుణంగానే బదిలీ జరిగింది. అన్ని రికార్డులు పరిశీలించాకే ఇరు పార్టీల ఆమోదం మేరకే రిజిస్ట్రేషన్ చేశాం. వాళ్లు కోర్టు ఇంటిమేషన్ లిస్టులో పెట్టుకోకపోవడం వల్ల ధరణిలో ఎలాంటి హెచ్చరిక కనబడలేదు. మిగతా హక్కుదారులు వచ్చి సమాచారం అందించగానే సదరు బదలాయింపు భూమిని పీఓబీలో పెట్టాం. కలెక్టర్, ఆర్డీఓ, సీసీఎల్ఏ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు లిఖిత పూర్వక ఆర్డర్లను పంపించాం. కొత్త ఆర్ఓఆర్ రాగానే వివాదాస్పద సర్వే నంబర్ 129 భూముల రిజిస్రేషన్లను రద్దు చేస్తాం. ఈ విషయంలో అధికారులను తప్పుగా చిత్రీకరించడం తగదు.

# దాయాదికి మరో షాక్.. పాక్ ఎయిర్‌లైన్లకు భారత గగనతలం మూసివేత..?




ఈ కబురు: సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు భారత్ మరో షాక్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. దాయాది దేశానికి చెందిన ఎయిర్‌లైన్లకు మన గగనతలాన్ని మూసివేశ దిశగా ఆలోచనలు చేస్తోంది.

నసాగుతున్నాయి. తమపై ఆంక్షలు విధించిందనే అక్కసుతో భారత్‌పై పాకిస్థాన్ విషం చిమ్మింది. తమ గగనతలంపై మన దేశ విమానాల రాకపోకలపై నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీ కూడా దీనిపై ప్రతీకార చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాక్ విమానయాన సంస్థలకు మన గగనతలాన్ని మూసివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇక, పాకిస్థానీ నౌకలు కూడా భారత పోర్టుల్లోకి రాకుండా నిషేధం విధించనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

‘‘ప్రస్తుతం ఈ ప్రతిపాదన పరిశీలన దశలో ఉంది. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు’’ అని కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఓ అధికారి వెల్లడించినట్లు సమాచారం. ఒకవేళ దీనిపై భారత్ నిర్ణయం తీసుకుంటే.. అది పాక్ ఎయిర్‌లైన్లపై పెను ప్రభావం చూపించే అవకాశం ఉంది. పాక్ విమానాలు (Pakistan Flights) కౌలాలంపూర్ సహా మలేసియాలోని ఇతర నగరాలు, సింగపూర్, థాయ్‌లాండ్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే మన గగనతలాన్ని దాటాల్సిందే.

ఇప్పుడు భారత్ నిషేధం విధిస్తే.. దక్షిణాసియా ప్రాంతాలకు వెళ్లేందుకు చైనా లేదా శ్రీలంక మీదుగా విమానాలను మళ్లించాల్సి ఉంటుంది. అప్పుడు ప్రయాణసమయం పెరగడంతో పాటు నిర్వహణ పైనా అదనపు భారం పడుతుంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన పాక్ ఎయిర్‌లైన్లకు ఇది మరింత శరాఘాతంగా మారనుంది.

ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల మన విమానాలకు పాక్ తమ గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. దీంతో భారత ఎయిర్‌లైన్లు కూడా ప్రత్యామ్నాయ మార్గాల్లో విమానాలు నడుపుతున్నాయి. అయితే, ఈ నిర్ణయంతో ఆర్థికంగా మనకంటే పాక్‌కే ఎక్కువ నష్టం అని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటివరకు భారత్ నుంచి పాక్ గగనతలం మీదుగా వారానికి 800లకు పైగా అంతర్జాతీయ విమానాలు రాకపోకలు సాగించేవి. ఇందుకోసం ఓవర్‌ఫ్లైట్ ఫీజు కింద పాక్ రోజుకు 1,20,000 డాలర్లు వసూలుచేసింది. ఇప్పుడు ఆ మొత్తాన్ని దాయాది నష్టపోవాల్సిందే. 2019లో పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో దాదాపు 5 నెలల పాటు పాక్ తమ గగనతలంలో భారత విమానాలపై ఆంక్షలు విధించింది. దీంతో అప్పట్లో ఆ దేశం 100 మిలియన్ డాలర్ల పైగా నష్టపోయినట్లు సమాచారం.

## ఆటో పరిశ్రమపై ట్రంప్ పట్టు విడుపు..?



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆటో మొబైల్ పరిశ్రమపై కొంచెం మెత్తపడినట్లు కథనాలు వెలువడుతున్నాయి.

ఈ కబురు: ఆటో మొబైల్ పరిశ్రమపై కొంచెం మెతకవైఖరి అవలంభించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించినట్లు ఆ దేశ మీడియా కథనాలు వెలువరించాయి. తన పాలనలో తొలి 100 రోజులు పూర్తయిన సందర్భంగా డెట్రాయిట్‌లో మంగళవారం ర్యాలీ నిర్వహించాలని ఆయన భావించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం కార్లను దిగుమతి చేసుకొంటున్న కంపెనీలు చెల్లించాల్సిన 25శాతం పన్ను తప్ప మిగిలిన వాటిని చెల్లించాల్సిన అవసరం ఉండదు. అంటే.. స్టీలు, అల్యూమినియం దిగుమతులపై కొంత మినహాయింపు లభించనుంది. ఈ విషయాన్ని వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనంలో పేర్కొంది. దీంతోపాటు విదేశీ ఆటోమొబైల్ విడిభాగాల చెల్లింపులకు ట్రంప్ కార్యవర్గం అనుమతిస్తోంది. వాస్తవానికి మే 3వ తేదీ నుంచి వీటిపై లెవీలు విధించాల్సి ఉంది. ట్రంప్ సుంకాల యుద్ధంలో తీవ్రంగా ప్రభావితమైన రంగాల్లో ఆటోమొబైల్ కూడా ఒకటి. మెక్సికో, కెనడా నుంచి దిగుమతులు అసాధ్యంగా మారిపోయాయి. డెట్రాయిట్లోని చాలా కార్ల తయారీదార్లకు ఈ దేశాల్లో పెట్టుబడులు ఉన్నాయి. ట్రంప్ తన మొదటివిడత పాలన సమయంలో నార్త్ అమెరికా ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్‌పై చర్చలు జరపడంతో వారు తమ పెట్టుబడులను కొనసాగించారు. మరోవైపు ఈ కార్ల ధరల పెంపు వాటి విక్రయాలను దెబ్బతీస్తాయనే భయాలు ఉన్నాయి.

ఇక అమెరికా వాణిజ్య మంత్రి హూవర్డ్ లుట్నిక్ మాట్లాడుతూ కీలక భాగస్వామ్యాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారని వాల్‌స్ట్రీట్ వెల్లడించింది. ‘‘దేశీయ కంపెనీలను ప్రోత్సహించేందుకు ట్రంప్ చేసుకోబోయే డీల్ ఆయన వాణిజ్య విధానానికి పెద్ద విజయంగా నిలుస్తుంది. దేశీయంగా కార్ల తయారీకి సిద్ధంగా అవసరమైన మార్గం కల్పిస్తుంది’’ అని వెల్లడించారు. తాజా మార్పులను అమెరికా ఆటో మొబైల్ పరిశ్రమ స్వాగతించింది.


## తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్.. కార్మికుల కీలక డిమాండ్లు ఇవే!

ఈ కబురు:తెలంగాణ ఆర్టీసీ కార్మికులు మే 7 నుంచి నిరవధిక సమ్మెకు దిగాలని నిర్ణయించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోవడంతో కార్మిక సంఘాల జేఏసీ ఈ నిర్ణయం తీసుకుంది. సమ్మెకు ముందు మే 5న కార్మిక కవాతు నిర్వహించనున్నారు. ఆర్టీసీ విలీనం, వేతన సవరణ, ఉద్యోగులకు సమాన వేతనాలు వంటి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని జేఏసీ కోరుతోంది.
తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్.. కార్మికుల కీలక డిమాండ్లు ఇవే!
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సమ్మె సైరన్ మోగింది. కార్మికులు చేసిన డిమాండ్లపై రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెకు దిగాలను ఆర్టీసీ నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే మే 7వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయాలని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ తీర్మానించింది. ఈ సందర్భంగా సమ్మె సంబంధించిన పోస్టర్‌ను ఆర్టీసీ కార్మిక జేఏసీ ఇవాళ ఆవిష్కరించింది. మే డే స్ఫూర్తితో ఆర్టీసీ సమ్మెకు జేఏసీ పూర్తి స్థాయిలో సిద్ధం అయింది. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలని జేఏసీ నాయకులు పేర్కొన్నారు.మరోవైపు.. ఈ నిరవధిక సమ్మెకు ముందు ఆర్టీసీ కార్మికులు మే 5వ తేదీన కార్మిక కవాతు చేపట్టనున్నట్లు జేఏసీ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళ్యాణ మండపం నుంచి బస్సు భవన్ వరకు సమ్మెకు మద్దతుగా ఆర్టీసీ యూనిఫామ్‌లలో కార్మికులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి కవాతు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరోవైపు.. కొన్ని ఆర్టీసీ కార్మికుల సంఘాలు జేఏసీలోకి వస్తామని.. మళ్లీ యాజమాన్యాలకు మద్దతుగా మాతో కలవడం లేదని.. యూనియన్లకు అతీతంగా అందరూ సమ్మెకు కలిసి రావాలని జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఇక తాజాగా ఆర్టీసీ కార్మికులు సమ్మె సైరన్ మోగించడంతో.. అసలేం జరుగుతుందోనని సామాన్య ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.




# ""లవ్ యూ మమ్మీ, డాడీ"" అని మెసేజ్ పెట్టి...

### హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి అదృశ్యం


సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి దినేష్ (ఫైల్ )

ఈకబురు, శేరిలింగంపల్లి : పండుగకు ఊరికి వచ్చిన కుమారుడు 'నేను లేకుండా మీరు హ్యాపీగా ఉంటారా' అని వేసిన ప్రశ్న నాడు ఆ తల్లిదండ్రులకు అర్థం కాలేదు... లవ్ యూ మమ్మీ, లవ్ యూ డాడీ అంటూ రెండు రోజుల క్రితం కుమారుడి ఫోన్ నుంచి వచ్చిన మెసేజ్ తో కంగారు మొదలైంది.. ఏదో జరిగి ఉంటుందనే భయంతో కుమారుడికి ఫోన్ చేస్తే ఫోన్ స్విచ్ ఆఫ్. పరుగుపరుగున కుమారుడు చదువుతున్న యూనివర్సిటీకి వస్తే తమ కుమారుడు కనిపించలేదు.. దీంతో శోకసంద్రంలో మునిగిన తల్లిదండ్రులు కుమారుడి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులకు మెసేజ్ పెట్టి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా చింతకాని మండలం, పాతర్లపాడు గ్రామానికి చెందిన గార్లపాటి జీవన్, రాధా దంపతుల పెద్ద కుమారుడు గార్లపాటి దినేష్(19)గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్స్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. క్యాంపస్ లోని కె హస్టల్ లో మరో రూమ్ మెట్ తో కలిసి ఉంటుండగా, తన రూమ్ మెట్ కు దెబ్బతగిలి ఇంటికి వెళ్లడంతో కొన్నిరోజులుగా దినేష్ ఒక్కడే ఉంటున్నాడు. కాగా కొన్నిరోజుల క్రితం జరిగిన ఈస్టర్ పండుగకు ఇంటికి వెళ్లిన దినేష్ తన తల్లిదండ్రులతో నేను లేకుండా మీరు హ్యాపీగా ఉంటారా అని ప్రశ్నించాడు. అనంతరం యూనివర్సిటీకి వచ్చిన దినేష్ ఈ నెల 27న లవ్ యూ డాడీ. లవ్ యూ మమ్మీ అంటూ ఇద్దరికి మెసేజ్ చేశాడు. వారు వెంటనే దినేష్ కు తిరిగి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీనితో వారు సెంట్రల్ యూనివర్సిటీ కి వచ్చి చూడగా కొడుకు కనిపించలేదు. స్థానికంగా విచారిస్తే శుక్రవారమే దినేష్ బైక్ మీద వెళ్లిపోయాడని తెలిసింది. దీంతో పాటు కొన్ని రోజుల క్రితం దినేష్ ఎవ్వరికీ చెప్పకుండా ఢిల్లీ, చెన్నై వెళ్ళినట్లు తెలుసుకున్నారు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించారు. వారి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దినేష్ ఆచూకీ కోసం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కాగా ప్రతిష్టాత్మక హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో చదువుతున్న విద్యార్థి అదృశ్యం కావడం సంచలనంగా మారింది.

## భానుడి భగభగ.. జగిత్యాలలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

**తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి.**

ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. మంగళవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో అత్యధికంగా 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో 44.3 డిగ్రీలు, నిజామాబాద్ జిల్లా మెందోరాలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. వివిధ జిల్లాల్లో మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతల వివరాలను పరిశీలిస్తే..

## దేశ వ్యతిరేకులపై స్పైవేర్ ఉపయోగిస్తే తప్పేంటీ? 'పెగాసస్'పై సుప్రీం కీలక వ్యాఖ్యలు

**ఈ కబురు: దేశ వ్యతిరేక శక్తులపై ప్రభుత్వం స్పైవేర్‌ను వినియోగించాల్సి వస్తే అందులో తప్పేముందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. పెగాసస్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.**

దిల్లీ: దాదాపు నాలుగేళ్ల క్రితం దేశ రాజకీయాలను కుదిపేసిన పెగాసస్ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ స్పైవేర్‌ను వినియోగించి దేశంలోని పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖులపై నిఘా పెట్టారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. జాతీయ భద్రతా ప్రయోజనాల కోసం ఓ దేశం స్పైవేర్‌ను కలిగిఉండటం తప్పులేదని కోర్టు స్పష్టంచేసింది. అయితే, అది ఎలా, ఎవరిపై ఉపయోగించారన్నదాని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.
పెగాసస్ ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈసందర్భంగా పిటిషన్ తరఫున న్యాయవాది మాట్లాడుతూ.. పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగిస్తోందా? లేదా అన్న విషయాన్ని కేంద్రం స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేగాక, ఈ ఆరోపణలపై దర్యాప్తు జరిపి సాంకేతిక నిపుణుల బృందం నివేదిక కోసం సర్వోన్నత న్యాయస్థానం గతంలో ఆదేశించిందని, ఇప్పటివరకూ ఆ నివేదిక అందలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దాన్ని వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. దీనికి ధర్మాసనం బదులిస్తూ.. ‘‘దేశం స్పైవేర్‌ను వినియోగిస్తే గనుక అందులో తప్పేముంది. అయితే, దాన్ని ఎవరిపైన ఉపయోగిస్తున్నారన్నదే ఇక్కడ ప్రశ్న. పౌర సమాజంపై కాకుండా.. దేశ వ్యతిరేక శక్తులపై దీన్ని వినియోగిస్తే గనుక అందులో ఏ తప్పు లేదు. దేశ భద్రత విషయంలో రాజీపడకూడదు. ఒకవేళ సామాన్య పౌరులపై ఉపయోగిస్తే గనుక దాని గురించి మేం దర్యాప్తు జరిపిస్తాం. ఉగ్రవాదులు గోప్యత హక్కును కోరకూడదు. అయితే, సామాన్య పౌరుల గోప్యతకు మేం తప్పకుండా రక్షణ కల్పిస్తాం’’ అని స్పష్టంచేసింది. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ‘‘ప్రస్తుతం మన దేశం ఎలాంటి పరిస్థితిలో ఉందో అందరికీ తెలుసు. మనం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది’’ అని పేర్కొంది. ఇక, సాంకేతిక బృందం నివేదిక గురించి మాట్లాడుతూ.. ‘‘దేశ భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన నివేదికను బహిర్గతం చేయడం సరికాదు. ఒకవేళ ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు దాని గురించి తెలుసుకోవాలనుకుంటే.. వారికి సమాచారం అందిస్తాం. అంతేగానీ.. వీధుల్లో చర్చించుకునే ఓ డాక్యుమెంట్‌గా ఈ నివేదిక మారకూడదు’’ అని ధర్మాసనం స్పష్టం చేసింది.
ఏంటీ పెగాసస్ దుమారం..?
ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్ఓ గ్రూప్ అనే సంస్థ ‘పెగాసస్’ స్పైవేర్‌ని అభివృద్ధి చేసింది. నిఘా కార్యకలాపాల కోసం ఈ స్పైవేర్‌ను ఎన్ఎస్ఓ పలు ప్రభుత్వాలు, ప్రభుత్వ అధీనంలో పనిచేసే సంస్థలకు విక్రయిస్తుంటుంది. అయితే, ఈ పెగాసస్‌ను ఉపయోగించి పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖుల ఫోన్లను హ్యాక్ చేశారంటూ 2021లో ఓ అంతర్జాతీయ పత్రిక సంచలన కథనం ప్రచురించింది. భారత్ నుంచి 300 మంది ఫోన్లు హ్యాక్ అయినట్లు పేర్కొంది. వీరిలో రాజకీయ ప్రముఖులు కూడా ఉన్నట్లు తెలిపింది. దీంతో ఈ వివాదం దేశ రాజకీయాలను కుదిపేసింది. అనంతరం దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే పెగాసస్‌పై విచారణకు ఆదేశించిన సుప్రీం.. ముగ్గురు సభ్యుల తో స్వతంత్ర నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ నివేదిక రూపొందించింది.

# 18 ఏళ్లలో 33 లక్షల మంది కొన్న కారు: దీని గురించి తెలుసా?

2007లో ఇండియన్ మార్కెట్లో అరంగేట్రం చేసినప్పటి నుంచి 'హ్యుందాయ్ ఐ10' ఏకంగా 33 లక్షల యూనిట్ల అమ్మకాలను అధిగమించింది. ఒక్క భారత దేశంలోనే ఈ కారును 20 లక్షల కంటే ఎక్కువ మంది కొనుగోలు చేశారు. కాగా కంపెనీ 140 కంటే ఎక్కువ దేశాలలో మరో 13 లక్షల యూనిట్లను ఎగుమతి చేసినట్లు తెలుస్తోంది.

హ్యుందాయ్ కంపెనీకి చెందిన ఐ10ను ఎక్కువగా దక్షిణాఫ్రికా, మెక్సికో, చిలీ, పెరూ దేశాలకు ఎగుమతి చేశారు. 2007లో మొదటి సారి ఇండియన్ మార్కెట్లో అడుగుపెట్టిన ఈ కారు.. ఆ తరువాత అనేక అప్డేట్స్ పొందుతూ.. ఐ10, గ్రాండ్ ఐ10, గ్రాండ్ ఐ10 నియోస్ అనే మూడు వేరియంట్లలో.. 1.2 లీటర్ పెట్రోల్ మాన్యువల్, 1.2 లీటర్ పెట్రోల్ ఆటోమాటిక్, CNGతో 1.2 లీటర్ పెట్రోల్ అనే మూడు ఇంజిన్ ఆప్షన్లలో అందుబాటులోకి వచ్చింది.

హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ ప్రతి ఏటా సగటున లక్ష యూనిట్ల కంటే ఎక్కువ ఐ10 కార్లను విక్రయించింది. ఇది మంచి డిజైన్, డ్యూయల్ ఎయిర్‌బ్యాగ్‌లు, ఏబీఎస్, కీలెస్ ఎంట్రీ వంటి అనేక కొత్త ఫీచర్స్ పొందింది. గ్రాండ్ i10 నియోస్ ధర రూ. 5.92 లక్షల నుంచి రూ. 8.56 లక్షల (ఎక్స్‌షోరూమ్) వరకు ఉంటుంది. ఇది ఎరా, మాగ్నా, కార్పొరేట్, స్పోర్ట్జ్, ఆస్టా అనే ఐదు వేరియంట్లలో లభిస్తోంది.




# ఎంతో కొంత వాటా ఇవ్వండి చాలు



**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దెబ్బకు చైనా కంపెనీలు భారత్ వైపు చూస్తున్నాయి. చైనాపై అమెరికా అధిక టారిఫ్‌లు విధించినందున, భారతీయ సంస్థలతో జట్టుకట్టి, ఇక్కడ నుంచి ఎగుమతులు చేసేందుకు వ్యూహాలు రూపొందించుకుంటున్నాయి.**

ట్రంప్ దెబ్బకు మారిన చైనా కంపెనీల తీరు
భారతీయ సంయుక్త సంస్థల్లో మైనారిటీ వాటాకూ సిద్ధం
హయర్ ఇండియాపై ఆర్ఐఎల్ కన్ను
ఓల్టాస్‌తో షాంఘై హైలీ చర్చలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దెబ్బకు చైనా కంపెనీలు భారత్ వైపు చూస్తున్నాయి. చైనాపై అమెరికా అధిక టారిఫ్‌లు విధించినందున, భారతీయ సంస్థలతో జట్టుకట్టి, ఇక్కడ నుంచి ఎగుమతులు చేసేందుకు వ్యూహాలు రూపొందించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే చైనా సంస్థ హయర్ అనుబంధ హయర్ ఇండియాలో వాటా కొనుగోలు విషయంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందు వరుసలో ఉంది. ఓల్టాస్‌తో జతకట్టేందుకు, టాటాలతో షాంఘై హైలీ గ్రూప్ చర్చలు పునః ప్రారంభించింది. రిఫ్రిజరేటర్ ఉత్పత్తుల తయారీ ప్రధాన సంస్థల్లో ఒకటైన హయర్, తన భారత విభాగంలో ఎంచదగ్గ వాటాను విక్రయించనుంది. ఈ వాటా కొనుగోలు రేసులో రిలయన్స్ ఇండస్ట్రీస్ ముందంజలో ఉందని ఒక ఆంగ్ల వార్తా సంస్థ తెలిపింది. వినియోగదారు ఎలక్ట్రానిక్స్, అప్లయెన్సెస్ తయారీ వ్యాపారాన్ని స్థానికీకరించుకోవడమే ధ్యేయంగా ఆ చైనా కంపెనీ, 2551% వాటాను విక్రయించాలనుకుంటోంది. 51% వాటా కొంటే, భారత కంపెనీయే అతిపెద్ద వాటాదారుగా మారుతుంది. ఈ కంపెనీ కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు సునీల్ మిత్తల్‌కు చెందిన భారతీ గ్రూప్ నుంచి పోటీ ఎదురవుతోంది.

**2020 తర్వాత మారిన భారత తీరు..**

2020లో చైనాతో ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో, ఆ దేశ పెట్టుబడుల విషయంలో మనదేశం ఆచితూచి వ్యవహరిస్తోంది. చైనా కంపెనీలతో సంయుక్త సంస్థ ఏర్పాటు చేయదలచుకుంటే, భారతీయ కంపెనీలకే బోర్డు ఆధిపత్యం ఉండాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే టాటాలకు చెందిన ఓల్టాస్‌తో ఒక సంయుక్త సంస్థ ఏర్పాటుకు షాంఘై హైలీ తన చర్చలను పునరుద్ధరించింది. మైనారిటీ వాటాకే పరిమితం అవడానికీ అంగీకరించిందనీ సమాచారం. భారత్ పెద్ద మార్కెట్ కావడం, ఇక్కడ నుంచి ఎగుమతి చేస్తే.. అమెరికా టారిఫ్ ప్రయోజనమూ లభించడమే ఇందుకు కారణం. ఎలక్ట్రానిక్స్ విడిభాగాలకు ఇటీవల ప్రకటించిన పీఎల్ఐ పథకం వల్ల, చైనాతో పోలిస్తే ఉత్పత్తి వ్యయాలూ తటస్థమవుతాయని విశ్లేషకులు అంటున్నారు.

**ఎంత వాటాకు అంగీకరించొచ్చు?**

మన కంపెనీలతో కలిసి ఏర్పాటు చేసే ఎలక్ట్రానిక్స్ సంయుక్త సంస్థల్లో, చైనా కంపెనీల వాటాను 10 శాతానికి పరిమితం చేయొచ్చని అధికార వర్గాల సమాచారం. సాంకేతికత బదిలీ షరతుపైనే ఇది జరగొచ్చనీ చెబుతున్నారు. చైనీస్ బ్రాండ్లకు బదులు ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ తయారీ భాగస్వాములు/సరఫరా కంపెనీల వైపే మొగ్గుచూపవచ్చని అంటున్నారు. అయితే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) నిబంధనల విషయంలో ఎటువంటి సడలింపులూ భారత ప్రభుత్వం ఇవ్వబోదని సమాచారం.

# ఇంటర్నెట్, వైఫై లేకుండానే లైవ్‌టీవీ.. ఫోన్స్ తెచ్చేందుకు హెచ్‌ఎండీ, లావా రెడీ




**ఇంటర్నెట్, వైఫై సదుపాయం లేకుండా టీవీ ప్రసారాలు అందించే డైరెక్ట్ టు మొబైల్ ఫోన్‌స్‌ను అందించేందుకు రెండు కంపెనీలు సిద్ధమయ్యాయి.**

మొబైల్‌లో టీవీ చూడాలంటే మొబైల్ డేటా అయినా ఉండాలి.. లేదంటే వైఫై కనెక్షన్ అయినా ఉండాలి. ఈ రెండూ లేకుండానే మొబైల్‌లో టీవీ ప్రసారాలు చూడగలిగితే? అవును మీరు విన్నది నిజమే! ఈ తరహా మొబైల్‌స్‌ను తీసుకొచ్చేందుకు రెండు మొబైల్ తయారీ కంపెనీలు సిద్ధమవుతున్నాయి. గతంలో నోకియా పేరుతో ఫోన్లు తయారుచేసే హెచ్‌ఎండీ సంస్థ.. ఫ్రీస్ట్రీమ్ టెక్నాలజీస్, ఇతరులతో కలిసి డీ2ఎం ఫోన్లు మార్కెట్లో విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. లావా ఇంటర్నేషనల్ సైతం డీ2ఎం ఫీచర్ ఫోన్‌ను లాంచ్ చేయనున్నట్లు ప్రకటించింది. వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ 2025 ఈవెంట్ వేళ ఈ రెండు కంపెనీల నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం.

డీ2ఎం సేవలను అందించడానికి హెచ్‌ఎండీ సంస్థ ఫ్రీస్ట్రీమ్ టెక్నాలజీస్, తేజస్ నెట్‌వర్క్స్, సింక్లెయిర్‌తో కలిసి మొబైల్ ఫోన్‌ను రూపొందించింది. దీన్ని వేవ్స్ 2025 ఈవెంట్‌లో ప్రదర్శించనుంది. మే 1 నుంచి నాలుగు రోజుల పాటు ముంబయిలోని జియో వరల్డ్ సెంటర్ వేదికగా ఈ ఈవెంట్ జరగనుంది. లావా కూడా ఇన్‌హౌస్ ఆర్‌అండ్‌డీ టీమ్‌తో పాటు తేజస్ నెట్‌వర్క్‌స్‌తో కలిపి ఫీచర్ ఫోన్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపింది. మీడియాటెక్ ఎంటీ6261 ప్రాసెసర్, శాంఖ్య రూపొందించిన ఎస్ఎల్3000 చిప్‌తో ఈ మొబైల్ పనిచేస్తుంది. టీవీ ప్రసారాల కోసం యూహెచ్‌ఎఫ్ యాంటెన్నా ఉంటుంది. 2.8 అంగుళాల క్యూవీజీఏ డిస్‌ప్లే, 2,200 ఎంఏహెచ్ బ్యాటరీ ఈ ఫీచర్‌లో అమర్చారు.

**ఏమిటీ టెక్నాలజీ?**

మొబైల్ ఫోన్లలో ఎఫ్ఎం రేడియో ప్రసారాల తరహాలో టీవీ కార్యక్రమాలు అందించడమే డైరెక్ట్‌టుమొబైల్ (డీ2ఎం) పరిజ్ఞానం. దీన్ని పూర్తిగా దేశీయంగా రూపొందించారు. దీనికి వైఫై, ఇంటర్నెట్ వంటివి ఏవీ అవసరం లేదు. ఇప్పటికే పలు నగరాల్లో దీనికి సంబంధించిన ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. త్వరలో పెద్ద సంఖ్యలో ట్రయల్స్ ప్రారంభం కానున్నాయి. మొబైల్ టీవీ ప్రసారాలతో పాటు అత్యవసర హెచ్చరికలకూ డీ2ఎం పరిజ్ఞానాన్ని వాడుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

# 1925లో బంగారం రేటు ఇంత తక్కువా?: అదే ధర ఇప్పుడుంటే..



భారతీయులు అలంకార ప్రియులు. కాబట్టి చాలామంది ఆభరణాలను ధరిస్తారు. ఆభరణాలలో కూడా ఎక్కువగా బంగారమే ఉంటుంది. ఇప్పుడు (2025లో) గోల్డ్ అంటే.. కొనడానికి కూడా కొంతమంది వెనుకడుగు వేస్తున్నారు. అయితే ఒకప్పుడు (1925లో) తులం పసిడి రేటు రూ. 18.75 ఉండేదంటే బహుశా కొందరు నమ్మక పోవచ్చు. నమ్మకపోయినా అదే నిజం. ఈ కథనంలో శతాబ్దానికి ముందు ఇండియాలో గోల్డ్ రేటు ఎలా ఉండేదో తెలుసుకుందాం.

- 1925: రూ. 18.75
- 1935: రూ. 30.81
- 1945: రూ. 62.00
- 1955: రూ. 79.00
- 1965: రూ. 72.00
- 1975: రూ. 540.00
- 1985: రూ. 2130.00
- 1995: రూ. 4680.00
- 2005: రూ. 7000.00
- 2015: రూ. 26845.00
- 2016: రూ. 29560.00
- 2017: రూ. 29920.00
- 2018: రూ. 31730.00
- 2019: రూ. 36080.00
- 2020: రూ. 48480.00
- 2021: రూ. 50000.00
- 2022: రూ. 53000.00
- 2023: రూ. 60000.00
- 2024: రూ. 80000.00
- 2025: రూ. 97970.00

1925లో 10 గ్రాముల రూ.18.75 వద్ద ఉండేది. అయితే ఈ రోజు గోల్డ్ రేటు రూ. 97,970 వద్దకు చేరింది. అంటే వందేళ్లలో బంగారం ధర 97951.25 రూపాయలు పెరిగింది.

బంగారం ధరలు పెరగడానికి కారణాలు

బంగారం ధరలు పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. బంగారం కొనేవారి సంఖ్య ఎక్కువవ్వడం, నిల్వలు తక్కువ కావడం. భౌగోళిక, రాజకీయ కారణాలు. బంగారం మీద పెట్టుబడి పెట్టే వారి పెరగడం కూడా గోల్డ్ ధరలు పెరగడానికి కారణమయ్యాయి. దీంతో పసిడి ధర సుమారు లక్ష రూపాయలకు చేరింది.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



మంగళవారం ఉదయం మిశ్రమంగా ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సరికి స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 28.11 పాయింట్లు లేదా 0.035 శాతం లాభంతో.. 80,246.48 వద్ద, నిఫ్టీ 7.45 పాయింట్లు లేదా 0.031 శాతం లాభంతో 24,335.95 వద్ద నిలిచాయి. టాప్ గెయినర్స్ జాబితాలో మాలు పేపర్ మిల్స్, పరాస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీస్, డేటా ప్యాటర్న్స్ (ఇండియా), గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ & ఇంజనీర్స్, టీబీఓ టెక్ వంటి కంపెనీలు చేరగా.. మ్యాక్స్ ఇండియా లిమిటెడ్, గ్లోబల్ వెక్ట్రా హెలికార్ప్, మనక్సియా, శివ మిల్స్ లిమిటెడ్, లక్ష్మీ ఫైనాన్స్ అండ్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ వంటి కంపెనీలు నష్టాలను చవిచూశాయి.

# ఇన్ఫోసిస్‌లో నాలుగోసారి.. 195 మంది ట్రైనీల తొలగింపు!




**ఇన్ఫోసిస్ సంస్థ మరోసారి తొలగింపులు చేపట్టింది. పరీక్షలో విఫలమైన 195 మంది ట్రైనీలను పక్కనపెట్టింది.**

ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌లో ట్రైనీల తొలగింపుల పర్వం కొనసాగుతోంది. తుది ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్‌లో విఫలమైన కారణంగా మరో 195 మందిని ఆ సంస్థ పక్కన పెట్టింది. ఈ ఏడాది ట్రైనీలను తొలగింపు చేపట్టడం వరుసగా ఇది నాలుగోసారి. పరీక్షలో ఫెయిల్ అయిన ట్రైనీలకు ఇమెయిల్ ద్వారా ఇన్ఫోసిస్ సమాచారం ఇచ్చినట్లు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. తొలగించిన ట్రైనీలకు ఇన్ఫోసిస్ ఉచితంగా శిక్షణ అందిస్తోంది. ఎన్ఐఐటీ, అప్‌గ్రాడ్ ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు 800 మందిని ట్రైనీలను ఇన్ఫోసిస్ తొలగించింది. అందులో 250 మంది ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. మరో 150 మంది ఇన్ఫోసిస్ అందిస్తున్న ఔట్ ప్లేస్‌మెంట్ సేవల కోసం రిజిస్టర్ చేసుకున్నట్లు తెలిసింది.

**చిత్తవకుండా.. పుత్తడి కొనండి.. ఈ జాగ్రత్తలు తప్పనిసరి!**

ఇన్ఫోసిస్ తొలుత ఫిబ్రవరి నెలలో 300 మంది ట్రైనీలను తొలగించింది. మార్చిలో 3035 మందిని, ఏప్రిల్‌లో 240 మందిని తొలగించింది. తాజాగా ఇది నాలుగోసారి. తొలగించిన ట్రైనీలకు ఒక నెల ఎక్స్‌గ్రేషియాతో పాటు రిలీవింగ్ లెటర్‌ను కూడా ఇస్తోంది. ప్రస్తుతం తొలగించిన ట్రైనీలు 2022లో ఇన్ఫోసిస్ నియమించుకుంది. వీరిని 2024 అక్టోబర్‌లో ఆన్‌బోర్డ్ చేసుకున్నట్లు 'బిజినెస్ స్టాండర్డ్' పేర్కొంది. కాగా, 202425 ఆర్థిక సంవత్సరంలో ఇన్ఫోసిస్ 15 వేల మంది ట్రైనీలను నియమించుకుంది.

# యూఎస్ మార్కెట్ లో నాని ర్యాంపేజ్.. మరో మార్క్.!




నాచురల్ స్టార్ నాని హీరోగా శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కించిన సాలిడ్ వైలెన్స్ అండ్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రం "హిట్ 3" కోసం అందరికీ తెలిసిందే. మరి శైలేష్ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తున్న మూడో సినిమా ఇది కాగా భారీ హైప్ ఈ సినిమాపై నెలకొంది. ఇక నాని సినిమాలకి యూఎస్ మార్కెట్ లో ఎంత స్ట్రాంగ్ గా వసూళ్లు ఉంటాయి అనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మరి ఇది మరోసారి హిట్ 3 విషయంలో రివీల్ అయ్యింది అయ్యింది అని చెప్పొచ్చు. హిట్ 3 యూఎస్ నార్త్ అమెరికాలో ఇపుడు 3 లక్షల డాలర్స్ మార్క్ ని కేవలం ప్రీ సేల్స్ లోనే రాబట్టేసి దూసుకెళ్తుంది. మరి ఈ చిత్రం ప్రీమియర్స్ సహా డే 1 కి ఏ రేంజ్ నంబర్స్ ని సెట్ చేస్తుంది అనేది వేచి చూడాల్సిందే. ఇక ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందించగా నాని నిర్మాతగా కూడా ఈ సినిమాకి వహించారు. అలాగే ఈ మే 1న పాన్ ఇండియా లెవెల్లో ఈ చిత్రం గ్రాండ్ గా రిలీజ్ కి రాబోతుంది.

# ఈ ఓటిటిలోకి ఐశ్వర్య రాజేష్ 'గరుడ 2.0'.!




సూపర్ మచ్చి, శాకాహారి, కాళరాత్రి, నేనే నా, కాజల్ కార్తీక, టీనేజర్స్, కథ కంచికి మనం ఇంటికి లాంటి చిత్రాలు హనుమాన్ మీడియా పతాకంపై తెరకెక్కించి తెలుగు లో విడుదల చేసిన సక్సెస్ ఫుల్ నిర్మాత బాలు చరణ్ ఇప్పుడు తమిళం లో అద్భుతమైన సస్పెన్స్ థ్రిల్లర్ గా నిలిచి బ్లాక్ బస్టర్ విజయవంతం అయిన ఆరత్తు సీనం చిత్రాన్ని తెలుగు లో గరుడ 2.0 గా మన తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. అరివాజగన్ వెంకటాచలం దర్శకత్వంలో హారర్ థ్రిల్లర్ డిమోంటి కాలనీ హీరో అరుళ్ నీతి తమిళరాజు, సంక్రాంతికి వస్తున్నాం హీరోయిన్ ఐశ్వర్య రాజేష్, ఐశ్వర్య దత్త హీరో హీరోయిన్ గా బ్లాక్ బస్టర్ గా నిలిచిన క్రైమ్ థ్రిల్లర్ చిత్రం "ఆరత్తు సీనం" అయితే ఇప్పుడు ఈ చిత్రాన్ని మన తెలుగు ప్రేక్షకులకు నిర్మాత బాలు చరణ్ గరుడ 2.0 గా మన తెలుగు స్ట్రీమింగ్ యాప్ ఆహాలో స్ట్రీమింగ్ అవుతుంది. మరి ఈ చిత్రాన్ని చూడాలి అనుకునేవారు ఆహాలో ట్రై చేయవచ్చు.



# ఎన్టీఆర్ – నీల్ నుంచి రెండు బ్లాస్టింగ్ అనౌన్సమెంట్స్ వచ్చేసాయి



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా ఇపుడు నటిస్తున్న అవైటెడ్ చిత్రాల్లో దర్శకుడు ప్రశాంత్ నీల్ తో తో చేస్తున్న భారీ సినిమా కూడా ఒకటి. ఎన్టీఆర్ కెరీర్లో 31వ సినిమా చేస్తున్న ఈ సినిమాపై గట్టి హైప్ నెలకొంది. ఇక ఆల్రెడీ షూటింగ్ స్టార్ట్ చేసుకున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఎప్పటికపుడు ఇంట్రెస్టింగ్ అప్డేట్స్ ఇస్తూనే ఉన్నారు.

మరి ఇలా లేటెస్ట్ గా మరో ట్రీట్ ని అందిస్తున్నట్టుగా మేకర్స్ తెలిపారు. అయితే అనూహ్యంగా మేకర్స్ కొత్త రిలీజ్ డేట్ ని అనౌన్సమెంట్ చేయడమే కాకుండా ఈ సినిమా తాలూకా గ్లింప్స్ పై కూడా క్రేజీ అప్డేట్ ని వారు అందించడం జరిగింది. ఇక ఈ మే 20న తారక్ బర్త్ డే కానుకగా అవైటెడ్ గ్లింప్స్ ని రిలీజ్ చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేసేసారు.

ఇక దీనితో పాటుగా ఈ చిత్రాన్ని సంక్రాంతి సీజన్ నుంచి షిఫ్ట్ చేసి వచ్చే ఏడాది జూన్ 25న గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నట్టుగా ప్రకటించారు. ఇలా రెండు బ్లాస్టింగ్ అప్డేట్స్ తారక్ ఫ్యాన్స్ కి వచ్చేసాయి అని చెప్పాలి. ఇక ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ వారు సంయుక్తంగా నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే

# అల్లు అర్జున్ కోసం 'లైగర్' బ్యూటీ..?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ని దర్శకుడు అట్లీ దర్శకత్వంలో తెరకెక్కించేందుకు సిద్ధమయ్యాడు. ఈ సినిమాను ఇటీవల అధికారికంగా అనౌన్స్ చేశారు. ఇక ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ బ్యానర్ ప్రొడ్యూస్ చేస్తుండటంతో ఈ మూవీ ఎలాంటి కథతో రాబోతుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించే వారి గురించి పలు ఇంట్రెస్టింగ్ వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమాలో అందాల భామ మృణాల్ ఠాకూర్ నటించబోతుందనే వార్త జోరుగా వినిపిస్తుంది. ఇక మరో హీరోయిన్‌గా దీపికా పదుకొనే పేరు కూడా వినిపించింది. కానీ, దీపికా ఈ సినిమాలో నటించడం లేదని.. ఆమె ప్లేస్‌లో 'లైగర్' బ్యూటీ అనన్య పాండే ఈ చిత్రానికి ఓకే చెప్పిందని తెలుస్తోంది.దీంతో ఇప్పుడు ఈ సినిమాలో అనన్య పాండే నటిస్తుందనే వార్త అభిమానుల్లో ఆసక్తికరంగా మారింది. లైగర్ మూవీతో డిజాస్టర్ మూటగట్టుకున్న ఈ బ్యూటీ, బాలీవుడ్‌లో సినిమాలు చేస్తున్నా, సౌత్‌లో మాత్రం అమ్మడికి సరైన చిత్రం పడలేదు. మరి అల్లు అర్జున్ – అట్లీ వంటి బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌లో ఆమెను ఎలాంటి పాత్ర కోసం తీసుకుంటున్నారా అనేది ఆసక్తికరంగా మారింది.



# విరబూసిన పూసలమ్మి మోనాలిసా అందం!

ప్రయాగ్ రాజ్ మహాకుంభమేళాలో మోనాలిసాగా వెలుగులోకి వచ్చిన పూసలు అమ్ముకునే అమ్మాయి ఉదంతం అందరికి తెలిసిందే. తన నీలి కళ్లతో..సమ్మోహన దరహాసంతో అందరిని తనవైపు ఆకర్షించిన పూసలమ్మి మోనాలిసాగా పేరొందింది. తనొకొచ్చిన పబ్లిసిటీలో సినిమా..యాడ్స్ అవకాశాలు అందుకున్న మోనాలిసా క్రమంగా మళ్లీ తెరమరుగై తన స్వగ్రామానికి వెళ్లిపోయింది. తాజాగా ఆమెకు సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. ఈ వీడియోలో గుర్తుపట్టలేనంతగా మేకప్ వేసుకున్న మోనాలిసాను చూసిన నెటిజన్లు మోనాలిసా మళ్లీ తిరిగొచ్చిందంటూ కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. సరికొత్త లుక్‌లో ముగ్ధమనోహరంగా కనిపిస్తున్న మోనాలిసాను చూసిన వారంతా ఇప్పుడు నిజంగా మోనాలిసా హీరోయిన్ గా మారిపోయిందంటూ కామెంట్స్ పెడుతున్నారు. అందానికి తోడుగా యాక్టింగ్..డాన్స్ నేర్చుకుంటే సినీ వినీలాకాశంలో మోనాలిసా కొత్త తారగా ఎదగవచ్చని సలహా ఇస్తున్నారు.



# 'డ్రాగన్' స్పెషల్ సాంగ్ లో క్రేజీ బ్యూటీ ?

ప్రశాంత్ నీల్ – ఎన్టీఆర్ కలయికలో రాబోతున్న సినిమా పై రోజుకొక రూమర్ వినిపిస్తోంది. పైగా ఈ సినిమాకు సంబంధించి ఎలాంటి వార్త వచ్చినా నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ క్రమంలోనే ఈ సినిమాలో మేకర్స్ ఓ స్పెషల్ సాంగ్ ను ప్లాన్ చేశారట. కాగా ఈ స్పెషల్ సాంగ్ కి సంబంధించి ఓ క్రేజీ న్యూస్ వినిపిస్తోంది. ఈ మూవీలో క్రేజీ బ్యూటీ ' రష్మిక మందాన' ఈ స్పెషల్ సాంగ్ లో కనిపించనుందనే వార్త వినిపిస్తోంది. మరి ఈ వార్తలో ఎంత వాస్తవం ఉందో చూడాలి.ఇక ఈ మూవీ టైటిల్ 'డ్రాగన్' అని ప్రచారంలో ఉంది. ఐతే, 'డ్రాగన్' సినిమాని ఎన్టీఆర్ కెరీర్ లోనే అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా చేయాలని ప్రశాంత్ నీల్ ప్రయత్నం చేస్తున్నాడట. అందుకే, ఈ సినిమా స్క్రిప్ట్ కోసం ప్రశాంత్ నీల్ చాలా టైమ్ తీసుకున్నాడు. కాబట్టి, ఇప్పటి వరకూ ప్రశాంత్ నీల్ తీసిన అన్ని సినిమాల్లోకల్లా బెస్ట్ సినిమా ఇదే అవుతుందని అంచనాలు ఉన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి ఈ సినిమాని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

# కేకేఆర్ ఈజ్ బ్యాక్.. ఢిల్లీపై గ్రాండ్ విక్టరీ

ఐపీఎల్-2025లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తిరిగి పుంజుకుంది. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 14 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్ విజయం సాధించింది. 205 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 9 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేయగల్గింది.

ఢిల్లీ బ్యాటర్లలో ఫాఫ్ డుప్లెసిస్(62) టాప్ స్కోరర్‌గా నిలవగా.. అక్షర్ పటేల్(43) ఫర్వాలేదన్పించాడు. వీరితో విప్రజ్ నిగమ్(19 బంతుల్లో 38) ఆఖరిలో మెరుపులు మెరిపించనప్పటికి జట్టును గెలిపించలేకపోయాడు. కేకేఆర్ బౌలర్లలో సునీల్ నరైన్ మూడు వికెట్లు పడగొట్టగా.. వరుణ్ చక్రవర్తి రెండు, అనుకుల్ రాయ్,రస్సెల్, ఆరోరా తలా వికెట్ సాధించారు.

అంతకుముందు బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. కేకేఆర్ బ్యాటర్లలో రఘువంశీ(44) టాప్ స్కోరర్‌గా నిలవగా.. రింకూ సింగ్(36), గుర్బాజ్(26), నరైన్(27), రహానే(26) రాణించారు. ఢిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లు పడగొట్టగా.. అక్షర్ పటేల్,విప్రజ్ నిగమ్ తలా రెండు వికెట్లు సాధించారు. ఈ విజయంతో కేకేఆర్ తమ ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది.









# సూర్యవంశీకి భారీ నజరానా.. రూ.10 లక్షలు ప్రకటించిన బిహార్ సీఎం



రాజస్తాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయాడు. సోమవారం జైపూర్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 14 ఏళ్ల సూర్యవంశీ సంచలన ప్రదర్శన కనబరిచాడు. అద్భుత సెంచరీతో క్రికెట్ ప్రపంచాన్ని తన వైపు తిప్పుకున్నాడు. అత్యంత చిన్న వయస్సులో ఐపీఎల్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు.

ఈ మ్యాచ్‌లో 38 బంతులు ఆడిన వైభవ్ సూర్యవంశీ ఏడు ఫోర్లు, పదకొండు సిక్సర్లతో 101 పరుగులు చేశాడు. బిహార్‌కు చెందిన సూర్యవంశీపై సర్వాత్ర ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో వైభవ్‌కు బిహార్ సీఎం నితీష్ కుమార్ రూ.10 లక్షల నగదు బహుమతిని ప్రకటించారు.

"ఐపీఎల్ చరిత్రలో సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడిగా (14 సంవత్సరాలు) నిలిచిన వైభవ్ సూర్యవంశీకి అభినందనలు. సూర్యవంశీ తన అద్భుత టాలెంట్‌తో భారత క్రికెట్‌కు భవిష్యత్తు ఆశాకిరణంగా నిలిచాడు. అతడి అంకితభావాన్ని, పట్టుదలను చూసి మేము గర్విస్తున్నాము.

నేను 2024లో సూర్యవంశీ, అతడి తండ్రిని కలిశాను. ఐపీఎల్‌లో అతడి అద్భుతమైన ప్రదర్శన తర్వాత, ఫోన్‌లో సూర్యవంశీతో మాట్లాడాను. వైభవ్ సూర్యవంశీకి రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 లక్షల నగదు బహుమతి అందజేయనున్నాము. వైభవ్ భవిష్యత్తులో భారత జట్టుకు కూడా కొత్త రికార్డులు సృష్టిస్తాడని ఆశిస్తున్నాను" అని నితీష్ కుమార్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

# చరిత్ర సృష్టించిన టీమిండియా ఓపెనర్.. ప్రపంచంలోనే తొలి ప్లేయర్‌గా



శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత మహిళా క్రికెట్ జట్టు ఓపెనర్ ప్రతీక రావల్ దుమ్ములేపుతోంది. మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ప్రతీక హాఫ్ సెంచరీతో మెరిసింది. రావల్ 91 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్సర్ తో 78 పరుగులు చేసింది.

ఈ క్రమంలో రావల్ ఓ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకుంది. మహిళల వన్డే క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా 500 పరుగులు చేసిన బ్యాటర్‌గా ప్రతీక రికార్డులకెక్కింది. 24 ఏళ్ల ప్రతీక రావల్ తన వన్డే అరంగేట్రం నుంచి అదరగొడుతోంది.ఈ క్రమంలో కేవలం 8 మ్యాచ్‌లలోనే ప్రతీక 500 పరుగుల మార్క్‌ను అందుకుంది. ఇంతకుముందు ఈ రికార్డు ఇంగ్లండ్ మహిళల జట్టు మాజీ ప్లేయర్ చార్లెట్ ఎడ్వర్డ్స్ పేరిట ఉండేది. 9 ఇన్నింగ్స్‌లలో ఆమె ఈ ఫీట్‌ను సాధించింది. తాజా మ్యాచ్‌తో ఎడ్వర్డ్స్ ఆల్‌టైమ్ రికార్డును రావల్ బ్రేక్ చేసింది.

మహిళల వన్డేల్లో అత్యంత వేగంగా 500 పరుగులు చేసిన ప్లేయర్స్ వీరే..

**ప్రతికా రావల్ - 8 ఇన్నింగ్స్‌లు**
**షార్లెట్ ఎడ్వర్డ్స్ - 9 ఇన్నింగ్స్‌లు**
**నికోల్ బోల్టన్ - 11 ఇన్నింగ్స్‌లు**
**బెలిండా క్లార్క్ - 12 ఇన్నింగ్స్‌లు**
**వెండీ వాట్సన్ - 12 ఇన్నింగ్స్‌లు**

ఇక ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై 15 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించింది. 277 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా అమ్మాయిలు..49. 2 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. ఓ దశలో సునాయాసంగా గెలిచే కన్పించిన సౌతాఫ్రికాను భారత స్పిన్నర్ స్నేహ్ రాణా దెబ్బతీసింది. రాణా తన 10 ఓవర్ల కోటాలో 43 పరుగులిచ్చి 5 వికెట్లు సాధించింది.

# ఉత్కంఠపోరు.. దక్షిణాఫ్రికా పై భారత్ విజయం





శ్రీలంక వేదికగా జరుగుతున్న మహిళల ముక్కోణపు వన్డే సిరీస్2025లో భారత్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఈ ట్రై సిరీస్‌లో భాగంగా మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో 15 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించింది. 277 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా అమ్మాయిలు..49. 2 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. ఓ దశలో సునాయాసంగా గెలిచే కన్పించిన సౌతాఫ్రికాను భారత స్పిన్నర్ స్నేహ్ రాణా దెబ్బతీసింది. 48వ ఓవర్‌లో మూడు కీలక వికెట్లు పడగొట్టి మ్యాచ్ స్వరూపాన్నే రాణా మార్చేసింది. రాణా ఓవరాల్‌గా తన 10 ఓవర్ల కోటాలో 43 పరుగులిచ్చి 5 వికెట్లు సాధించింది. దక్షిణాఫ్రికా 11 పరుగుల వ్యవధిలో ఐదు వికెట్లు కోల్పోయింది. దీంతో ఆమెకు ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు వరించింది. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో టాజ్మిన్ బ్రిట్స్( 107 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 109) వీరోచిత శతకంతో చెలరేగింది. ఆమెతో లారా వోల్వార్డ్ట్(43), అన్నేరీ డెర్క్సెన్(30) రాణించినప్పటికి.. వరుస క్రమంలో వికెట్లు కోల్పోవడంతో ప్రోటీస్ ఓటమి చవిచూడాల్సి వచ్చింది. ప్రతీక సూపర్ ఇన్నింగ్స్.. ఇక ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా 6 వికెట్ల నష్టానికి 276 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో ఓపెనర్ ప్రతీక రావల్(78) టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆమెతో కెప్టెన్ హర్మాన్ ప్రీత్ కౌర్(41), జెమీమా రోడ్రిగ్స్(41), మంధాన(36) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో మ్లాబా రెండు వికెట్లు పడగొట్టగా.. ఖాకా, క్లాస్ తలా వికెట్ సాధించారు.

# సంజు శాంసన్‌కు ఏమైంది? ఇదే 'ఆఖరి'



రాజస్థాన్ రాయల్‌స్‌కు సంజు శాంసన్ దూరమవుతున్నాడా? అందుకే అన్యమనస్కంగా ఉంటున్నాడా? సంజు శాంసన్.. ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ టీమ్ ఇండియాలో ఇప్పటిదాకా సుస్థిర స్థానం సంపాదించలేకపోయిన వికెట్ కీపర్ బ్యాటర్ సంజు. భారత జట్టులో అతడికి సరిపడా అవకాశాలివ్వలేదనే చర్చ ఎప్పుడూ ఉండేదే. ఐతే ఐపీఎల్‌లో సంజు ప్రతిసారీ మెరుపులు మెరిపిస్తుంటాడు. కానీ ఈ సీజన్‌లో అతడి మెరుపులు కరవయ్యాయి. సంజు మ్యాచ్ ఆడడమే గగనంగా మారింది. ఓవైపు గాయాలతో సతమతం అవుతూ.. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ లో ఇమడలేక అతను ఆ జట్టు నుంచి దూరం జరగడానికి ప్రయత్నిస్తున్నాడనే ప్రచారం జరుగుతోంది.

సోమవారం గుజరాత్‌తో మ్యాచ్ సందర్భంగా రాజస్థాన్ రాయల్స్ డగౌట్‌లో సంబరాలు మామూలుగా లేవు. వరుసగా అయిదు ఓటముల తర్వాత ఆ జట్టుకు ఓ విజయం అందించిన మ్యాచ్ ఇది. 14 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ మ్యాచ్‌లో సంచలన బ్యాటింగ్‌తో.. 35 బంతుల్లోనే శతకం సాధించాడు. అతడి శతకం పూర్తయినపుడు స్టేడియంలోని ప్రేక్షకులంతా స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ఈ సీజన్ ముంగిట ఏదో మ్యాచ్ ఆడుతూ గాయపడి వీల్ ఛైర్‌కు పరిమితమైన రాహుల్ ద్రవిడ్ సైతం.. ఉత్సాహంలో లేచి నిలబడి వైభవ్‌ను అభినందించాడు. కానీ ఆ సమయంలో సంజు శాంసన్‌లో పెద్దగా స్పందనా లేదు. కూర్చుని మొక్కుబడిగా చప్పట్లు చరుస్తూ కనిపించాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. జట్టంతా అంత సంతోషంలో ఉంటే.. తనకేం సంబంధం లేదన్నట్లు సంజు ఇలా అన్యమనస్కంగా కనిపించడం ఆశ్చర్యానికి గురి చేసింది. సంజు ఈ సీజన్లో ఇలా వింతగా ప్రవర్తించడం తొలిసారేమీ కాదు. దిల్లీ క్యాపిటల్‌స్‌తో సూపర్ ఓవర్‌కు దారి తీసిన మ్యాచ్‌లో సంజు ప్రవ తాను ఓపెనర్‌గా మారడం కోసమే బట్లర్‌ను సంజు సాగనంపేశాడని, ఇప్పుడు వైభవ్ సూర్యవంశీ ఆ స్థానానికి ఎసరుపెడుతుండడంతో తట్టుకోలేకపోతున్నాడని రకరకాల ఊహాగానాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఇదిలా ఉంటే సంజు గాయాల విషయంలో రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముందు వేలి గాయంతో కొన్ని మ్యాచ్‌ల్లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా మాత్రమే ఆడాడు. ఆ తర్వాత ఎన్‌సీఏ నుంచి క్లియరెన్స్ తెచ్చుకుని పూర్తి స్థాయిలో ఆడుతూ జట్టు సారథ్య బాధ్యతలు అందుకున్నాడు. కానీ దిల్లీతో మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తుండగా పక్కటెముకలు పట్టేయడంతో మైదానాన్ని వీడిన అతను.. ఆ తర్వాత తిరిగి మ్యాచ్ ఆడలేదు. బ్యాటింగ్ చేస్తూ పక్కటెముకలు పట్టేస్తే నాలుగు మ్యాచ్‌లు దూరంగా ఉండడమేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గాయం పేరుతో అతణ్ని రాయల్స్ కావాలనే పక్కన పెట్టిందని కొందరంటుంటే.. సంజునే కావాలని మ్యాచ్‌లకు దూరంగా ఉన్నాడని మరికొందరంటున్నారు. ఏదేమైనప్పటికీ.. ఈ సీజన్లో సంజు పేరు ప్రతికూల విషయాలతోనే వార్తల్లో నిలుస్తోంది. రాయల్‌స్‌తో అతడికి చెడిందని, వచ్చే సీజన్‌కు అతను జట్టు మారడం ఖాయమని, చెన్నై సూపర్ కింగ్‌స్‌లోకి అతను వెళ్తే ఆశ్చర్యం లేదని అంటున్నారు. మరి ఏమవుతుందో చూడాలి.

# భారత్‌కు చావోరేవో

బీడబ్ల్యూఎఫ్ సుదిర్మన్ కప్ ఫైనల్స్ నుంచి భారత్ నిష్క్రమించింది. ప్రతిష్ఠాత్మక టోర్నీలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడి ఇంటిముఖం పట్టింది. షియామెన్ (చైనా): బీడబ్ల్యూఎఫ్ సుదిర్మన్ కప్ ఫైనల్స్ నుంచి భారత్ నిష్క్రమించింది. ప్రతిష్ఠాత్మక టోర్నీలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడి ఇంటిముఖం పట్టింది. మంగళవారం గ్రూపు-డి పోరులో భారత్ 14తో ఇండోనేసియా చేతిలో ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల తనీషా క్రాస్టో జోడీ 1021, 2118, 2119తో రెహాన్ నౌఫాల్ గ్లోరియా ఇమాన్యుయెల్లీ జంటను చిత్తుచేసి భారత్‌కు శుభారంభాన్ని అందించింది. అయితే స్టార్ క్రీడాకారిణి పి.వి.సింధు 1221, 1321తో పుత్రి కుసమ వర్దని చేతిలో ఓడటంతో 11తో స్కోరు సమమైంది. పురుషుల సింగిల్స్‌లో హెచ్.ఎస్.ప్రణయ్ 2119, 1421, 1221తో జొనాథన్ క్రిస్టీ చేతిలో పరాజయం చవిచూడటంతో ఇండోనేసియా 21తో ఆధిక్యం సంపాదించింది. మహిళల డబుల్స్‌లో ప్రియా శ్రుతి మిశ్రా జోడీ 1021, 921తో లానీ మయసరి సితి రమధంతి జంట చేతిలో ఓడటంతో భారత్‌కు భంగపాటు తప్పలేదు. నామమాత్రమైన పురుషుల డబుల్స్‌లో హరిహరన్ రుబన్ కుమార్ జోడీ 2022, 1821తో మహ్మద్ ఫిక్రి డానియెల్ మార్తిన్ జంట చేతిలో ఓడింది. గ్రూపు-డి తొలి పోరులో భారత్ 14తో డెన్మార్క్ చేతిలో పరాజయం చవిచూసింది.

